క్లుప్తంగా

29, 30 తేదీల్లో వ్యవసాయ యూనివర్సిటీ వజ్రోత్సవాలు

దర్శి(కురిచేడు): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడి 60 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాంఫారం ఆడిటోరియంలో ఈ నెల 29, 30 తేదీల్లో వజ్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వజ్రోత్సవాలు ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. మొదటి రోజు వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న మార్పులు, తదనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం గురించి సదస్సు జరుగుతుందన్నారు. రెండో రోజు అభ్యుదయ రైతులతో వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పడి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రూపొందించిన కొత్త వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానంపై చర్చిస్తామన్నారు. జిల్లా రైతులు, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చదివిన పూర్వ విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

సకాలంలో రుణాలు రికవరీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీసీ కోటేశ్వరరావు

ముండ్లమూరు(కురిచేడు): స్వయం సహాయక గ్రూపులకు ఇచ్చిన అన్ని రకాల రుణాలు సకాలంలో రికవరీ చేయాలని ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరా దేవి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం మండల సమాఖ్య అధ్యక్షురాలు ఈ వెంకాయమ్మ అధ్యక్షతన ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వసుంధరా దేవి మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్, ఎస్‌హెచ్‌జీ క్రెడిట్ ప్లాన్, పీఎంఎఫ్ఎంఈ, పీఎం షెడ్‌నెట్ గురించి చర్చించారు. అన్ని రకాల రుణాలు సకాలంలో రికవరీ చేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలవాలని ఆమె కోరారు. సమావేశంలో ఏపీఎం హనుమంతరావు, సీసీ కోటేశ్వరరావు, అకౌంటెంట్ మార్తమ్మ, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

మేం ఎవరి ఆస్తిని ఆక్రమించలేదు


డాక్యుమెంట్లు చూపుతున్న వెంకటరెడ్డి

మార్కాపురం: పట్టణంలోని తూర్పువీధిలో నివాసముంటున్న తాము ఎవరి ఆస్తిని ఆక్రమించలేదని గొలమారి వెంకటరెడ్డి, సాయికుమార్‌రెడ్డిలు తెలిపారు. శనివారం వారు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సర్వేనంబరు 1132/3లో షెడ్యూల్ ఆస్తి వారసత్వంగా వచ్చిందన్నారు. అందులో కొంత భూమి ఒంగోలు-కర్నూలు జాతీయ రహదారి నిర్మాణంలో భూసేకరణలో పోయిందని, మిగిలిన భూమిని తాము సాగుచేసుకుంటున్నామని అన్నారు. అయితే తమ సోదరుడు గొలమారి నారాయణ రెడ్డి, ఆయన కుమారుడు శివారెడ్డిలు తమపై నిరాధార అసత్య ఆరోపణలు చేశారన్నారు. రాజకీయ కోణంలో వారే తమను బెదిరిస్తున్నారని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. చట్టరీత్యా తమకు అన్నీ హక్కు పత్రాలు ఉన్నాయని, సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. ఎవైనా సమస్యలు ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకుంటామని తెలిపారు.

వేసవి దుక్కులు.. చీడపీడలు పరుగు


వేసవి దుక్కులు చేసిన పొలం


దుక్కులు చేసిన పొలంలో సేంద్రియ ఎరువు కుప్పలు

- లోదుక్కులతో భూసారం పెంపు
- చీడపీడలు, కలుపు నివారణ
- వాలుకు అడ్డంగా దున్నడంతో నీటి నిల్వ శక్తి పెరుగుదల

బేస్తవారిపేట: పంట కోతలు దాదాపు పూర్తయ్యాయి. అయితే వర్షాకాలం వచ్చేంత వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారుతాయి. వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు, చీడ పురుగులు భూమిలో ఉంటాయి. వేరుశనగ, పప్పుశనగ, కంది, మిరప పంటలు వేసినప్పుడు లద్దె పురుగులు భూమిలో ఉండిపోతాయి. ఈ వేసవిలో లోతైన దుక్కులు చేస్తే నేలలో ఉన్న చీడ పురుగులు, గుడ్లు, కోశాలు బయటపడి చనిపోతాయి. కొంగలు, కాకులు, పిచ్చుకలు తదితర పక్షులు వాటిని తిని నాశనం చేస్తాయి. అలాగే కలుపును కూడా నివారించవచ్చు. వేసవి దుక్కులతో వర్షపు నీరు లోపలి పొరల్లోకి ఇంకి భూమి సారాన్ని పెంచుతుంది. దుక్కి చేయకుండా భూమిని ఖాళీగా వదిలేయడం వల్ల కలుపు మొక్కలు, ఇతర గడ్డి జాతి మొక్కలు పెరిగి భూమిలోని తేమను, పోషకాలను గ్రహించి భూమిని సత్తువ లేకుండా నిర్వీర్యం చేస్తాయి. జిల్లాలో రబీ సీజన్‌లో 2.99 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు.

ప్రయోజనాలు ఇవీ..

- సమగ్ర సస్యరక్షణలో భాగంగా వేసవిలో లోతు దుక్కులను చేయడంతో పురుగు మందుల ఖర్చు తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.
- వర్షాలకు ముందు భూమిని వాలుకు అడ్డంగా దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోనికి ఇంకుతుంది.
- ఈ దుక్కులతో ఇతర గడ్డిజాతి మొక్కల విత్తనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలకు గురై మొలిచే శక్తిని కోల్పోతాయి.
- దుక్కుల అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువులు పొలంలో చల్లుకోవాలి. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయి.
- వేసవిలో దుక్కి దున్నితే భూమి గుల్లగా మారుతుంది. దీంతో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా, తేమలో జీవించే వానపాముల సంతతి వృద్ధి చెందుతుంది. ఇవి భూసార పరిరక్షణకు దోహదపడతాయి.
- లోతు దుక్కులు చేయడంతో వరిలో కాండం తొలుచు పురుగు, లద్దె పురుగు, పత్తిలో లద్దె పురుగులు, శనగపచ్చ పురుగులు, మిరపలో కాయతొలుచు పురుగులు నశిస్తాయి.
- పొలంలో గత పంట అవశేషాలుంటే లోతుగా దున్నడంతో భూమిలో కలిసిపోతాయి. ఫలితంగా సేంద్రియ ఎరువుగా మారి భూమి సారాన్ని పెంచుతుంది.

వాలుకు అడ్డంగా..

వేసవి దుక్కులు వాలుకు అడ్డంగా లోతుగా చేపట్టాలి. ఇలా చేయడం వల్ల వర్షాలు పడినా భూసారం బయటకు కొట్టుకుపోదు. పొలం గుల్లగా ఉండటం వల్ల వర్షాలు కురిసే సమయంలో ఆ నీరు భూమిలో ఇంకిపోతుంది. దీని వల్ల భూ అంతర్భాగంలో నీటి నిల్వలు చెక్కు చెదరవు. తేమను నిలుపుకునే సామర్థ్యం పెంచేందుకు దుక్కుల సమయంలో పశువుల పేడ చల్లి ఎద్దులతో దున్నడం మంచి పద్ధతి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులు ఈ విధానంపై దృష్టి సారించాలి. మార్చి రెండో వారం నుంచి మే రెండో వారం వరకు వేసవి దుక్కులకు అనుకూలం. రానున్న ఖరీఫ్ పంటకు సంబంధించి ఇప్పటి నుంచే రైతులు వేసవి దుక్కులు చురుకుగా చేపడుతున్నారని మండల వ్యవసాయ అధికారిణి జక్కం మెర్సీ చెప్తున్నారు.

వేసవి దుక్కులు ఎంతో ఉపయోగం

వేసవి దుక్కులు చేసుకోవడంతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భూమిలో ఉన్న చీడ పురుగుల గుడ్లు బయటపడి నశిస్తాయి. పురుగు మందుల ఖర్చు తగ్గుతుంది. రబీ తరువాత భూమిని వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు వేయాలి. తొలకరి వర్షాలు పడినప్పుడు నీరు భూమిలోకి ఇంకిపోయి నేల సారవంతం అవుతుంది. వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.

– జక్కం మెర్సీ, ఏవో, బేస్తవారిపేట

భూసార పరీక్షలను బట్టి ఎరువులు వాడాలి


మద్దలకట్టలో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: భూసార పరీక్షలను బట్టి ఎరువులను వాడటం వలన భూమి సారవంతంగా ఉంటుందని కే బుజ్జిబాయి అన్నారు. మండలంలో మద్దలకట్ట గ్రామంలో రైతులకు భూసార పరీక్షలపై శనివారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలను అనుసరించి ఎరువుల వాడకంలో మెళకువలు పాటించాలన్నారు. మట్టి పరీక్షలో ఆమ్ల, క్షార సూచిక లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, లభ్య భాస్వరం, లభ్య పోటాషియం మొదలైనవి ఏ నిష్పత్తిలో ఉన్నాయో తెలుసుకోవటం వలన నాటిన పైరుకు వయస్సును, కాలాన్ని బట్టి అవసరమైన ఎరువులను సరైన పాళ్లలో అందించవచ్చన్నారు. ఈ పరీక్షల వలన ఆమ్లగుణం ఉన్న నేలలను సున్నంతో, క్షారగుణం ఉన్న నేలలను జిప్సంతో బాగు చేసుకోవచ్చని తెలిపారు. ఒకటి నుంచి ఐదు ఎకరాల భూమిని ప్రామాణికంగా తీసుకొని భూమిలో పలుచోట్ల ఉన్న మార్పులను బట్టి మట్టి నమూనాలు సేకరిస్తారన్నారు. భూసార పరీక్షల్లో భూమి చౌడు బారితే వెంటనే తెలుస్తుందని, భూసార పరీక్షా ఫలితాలను అనుసరించి ఎరువులు వాడితే భూసారం దెబ్బతినదని, దాని వలన పంట దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు


రాజంపల్లిలో ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత గొంద్రాలికొండ తిరుమలనాథస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, అభరణాలు, పూల మాలతో అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నెస్ట్ శిక్షణ శిబిరాలకు గిరిజన విద్యార్థినులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలకు చెందిన నలుగురు గిరిజన విద్యార్థినులు జేఈఈ మెయిన్స్‌కు అర్హత సాధించటంపై ప్రిన్సిపాల్ ఈశ్వరసింగ్ హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలకు చెందిన మల్లీశ్వరీబాయి, అనూభాయి, నాగలక్ష్మీ బాయి, అనూషబాయిలను పాఠశాల సిబ్బంది అభినందనలతో ముంచెత్తారు. న్యూ ఢిల్లీకి చెందిన కేంద్ర సంస్థ నెస్ట్‌లో జేఈఈ అడ్వాన్స్ కోచింగ్ కోసం ప్రత్యేక శిక్షణ శిబిరాలకు నలుగురు విద్యార్థులు హాజరు కానున్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దర్శి(కురిచేడు): ముండ్లమూరు మండలం ఉల్లగల్లు వద్ద ఆటోబోల్తా పడిన ఘటనలో మృతి చెందిన బండి శారమ్మ కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శనివారం ఆర్థికసాయం అందజేసింది. సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, అధ్యక్షుడు డి.వెంకటరెడ్డి రూ.11 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ అడ్వయిజర్ పి.రాజశేఖరరెడ్డి, ట్రెజరర్ జి.వేణు, ఏ వెంకటేశ్వర్లు, సీహెచ్ తిరుపతిరెడ్డి, ఎల్ వెంకటేశ్వరరెడ్డి, బి రంగారావు, ఎస్ వెంకటరావు, ప్రేమ్‌కుమార్, మోషే, పాస్టర్ యోహాన్, లయన్స్‌క్లబ్ జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్ పర్సన్ కె.విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను చెంచులు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న తహశీల్దార్ కిన్నెర శాంతి

పెద్దదోర్నాల: ప్రభుత్వం అందించే పథకాలను చెంచు గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శాంతి అన్నారు. మండల కేంద్రంలోని శివసదనంలో శనివారం ఆదర్శ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ ఫేస్ మీటింగ్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను జాగ్రత్త పరుచుకుని ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీంతో పాటు రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కరుణాకర్, ఆర్‌ఓఎఫ్‌ఆర్ కో ఆర్డినేటర్ మంతన్న, వీఆర్వో వెంకటయ్య, ప్రసాద్, శ్యామ్యేల్‌జాన్, కోటేశ్వరరావు, దావీద్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో గవర్నర్ ఏడీసీ పూజలు


పూజలు చేస్తున్న రామాంజనేయులు

మార్కాపురం: లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఏడీసీ, అదనపు ఎస్పీ ఎస్‌వీ రామాంజనేయులు శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి గర్భాలయంలో అర్చకులు అప్పనాచార్యులు, రామాంజనేయులతో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి ప్రాశస్త్యాన్ని వివరించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం బహూకరించారు. రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2017లో ఆయన మార్కాపురం డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. అప్పట్లో రాష్ట్రంలోనే తొలిసారిగా హైవే రోడ్లపై యాక్సిడెంట్ల నివారణకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఇప్పుడు రాష్ట్రమంతా అమలు జరుగుతోంది.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి


సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ జనార్దన్

ముండ్లమూరు(కురిచేడు): పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఎంపీడీఓ జనార్దన్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు సగటు కూలి రూ.290 తగ్గకుండా ఉండేలా మార్కింగ్ ఇవ్వాలన్నారు. ప్రతి రోజు 6 వేల మంది కూలీలు పనిచేసేలా చూడాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఫారమ్‌ఫాండ్ పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ టి.వెంకటరావు, ఈసీ శివరామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

తర్లుపాడు: మండలంలోని బుడ్డపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. కూలీలకు తప్పనిసరిగా రూ.307 వేతనం వచ్చేలా చూడాలని, పని కిరాని వారి పేరున మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని ఫీల్డు అసిస్టెంట్‌ని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నూతనంగా నిర్మించిన పశువుల తొట్లను పరిశీలించారు. ఈసీ సుభద్రాదేవి తదితరులు ఉన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

దర్శి(కురిచేడు): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. మండలంలోని పోతవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో 10వ తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు గ్రామానికి చెందిన కోరే బాల రంగసాయి రూ.7 వేలను అందజేశారు. 586 మార్కులు సాధించిన గురుప్రసన్న, 547 మార్కులు సాధించిన ప్రదీప్, 541 మార్కులు సాధించిన టి.రామలక్ష్మిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు టి.విజయభాస్కర్‌రెడ్డి, ఐవీఎల్ నారాయణ, వైజి లివింగ్‌స్టన్, వీవీఎస్ శాస్త్రి, టి.బాలసుబ్బయ్య, డి.మానసింగ్ తదితరులు అభినందించారు.

గోకులం షెడ్లు శరవేగంగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ దారా హనుమంతరావు

తాళ్లూరు: నిర్మాణ దశలో ఉండి ఆగిపోయిన గోకులం షెడ్లను శరవేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ దారా హనుమంతరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఒక్క కూలి లబ్ధి పొందాలన్నారు. రోజుకు రూ.300 కూలి వచ్చేలా పనిచేసే విధానంపై అవగాహన కల్పించారు. అధిక ఉష్ణోగ్రత దృష్ట్యా కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కె.వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి


రైతుల హక్కు పత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సంజీవరావు

తాళ్లూరు: రైతులు వారి భూ సమస్యలను తమ దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సంజీవరావు అన్నారు. మండలంలోని బెల్లంకొండవారిపాలెం, విఠలాపురం గ్రామాల్లో నిర్వహించిన రీ సర్వేలో భాగంగా వచ్చిన సమస్యలపై శనివారం ఆయా గ్రామాల విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏమైనా భూ సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు తగిన న్యాయం చేయాలని సూచించారు. వారి వద్ద ఉన్న హక్కు పత్రాలను, భూములను స్పష్టంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రీసర్వే డీడీ ప్రశాంత్, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు రైతులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి


వైపాలెంలో ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాలు, వ్యాపారులు

దర్శి(కురిచేడు): కాశ్మీర్‌లో అమాయకులను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని జర్నలిస్టు నేతలు కోరారు. ఉగ్ర దాడిని నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం నిరసన ర్యాలీ చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యాటకులపై దాడి పిరికిపంద చర్య

దర్శి(కురిచేడు): టూరిస్టులపై జరిగిన ఉగ్ర దాడి పిరికిపంద చర్య అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కైపు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉగ్ర దాడిలో మృతి చెందిన వారికి సంతాపంగా స్థానిక గడియార స్తంభం దగ్గర కొవ్వొత్తుల ర్యాలీ ప్రదర్శన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్ర దాడి అత్యంత దారుణమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాటం వెంకట రమణారెడ్డి, దర్శి నగర అధ్యక్షుడు పొలేష్, మండల అధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి, తాళ్లూరు మండల అధ్యక్షుడు కూకట్ల వీరబ్రహ్మం, కురిచేడు మండల అధ్యక్షుడు షేక్.మీరావలి, ఎస్సీ సెల్‌నాయకులు ప్రశాంత్, బుజ్జి పాల్గొన్నారు.

పహల్‌గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ శాంతి ర్యాలీ

యర్రగొండపాలెం: పహల్‌గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ శనివారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోనేరు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీ ప్రారంభించారు. ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీ బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులు వెలిగించి పహల్‌గామ్ మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా వ్యాపారులు, ప్రజా సంఘాలు పాల్గొన్నాయి.



దర్శిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు



దర్శిలో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు